స్కెచ్

# రాగోదయం

"సులోచన"

అంతవరకూ వాలిపోయిన సాయంత్రపు పలుచని యెండ బంగారు కాంతితో అందంగా నీటి అలలమీద జారుతుంటే— వొడ్డున కూర్చున్న సూర్యం వొళ్ళుతెలియని అనుభూతికి, ప్రకృతి సౌందర్యాన్ని దర్శించే కవికిమల్లే గురిఅవుతూ—వెనుగ్గా ఇసుకమీద నడిచిపోయే మనుష్యుల్ని గమనించకుండా నిశ్చలంగా నిద్రిస్తోన్న నీళ్ళల్లో ఎవరో అనూయ కొద్దీ పెద్దరాయి వేసినట్టి చప్పుడ్ని స్ఫురింప జేసే నవ్వు హఠాత్తుగా వినిపించగా వెనుదిరిగి చూశాడు

ఆమె పిల్లను ఎత్తుకొనివుంది. ఆమె భర్త మూడేళ్ళ పిల్లవాడిని మెల్లగా నడిపించు కెళు తున్నాడు భార్యా, భర్తా—కులాసాగా కబుర్లు చెప్పకుంటో వెళుతున్నారు; ఒకళ్ళ కొకళ్ళు నవ్వించు కుంటున్నారు.

ఆమె కనకాంబరం షిఫాన్ చీరెపైన, నెమలి కంఠపు సాటిన్ జాకెట్టు ధరించింది సాయంత్రపు సముద్రపుగాలికి పల్చనిచీరె రెప రెప లాడుతోంది. మెడలోని మామిడిపిందెల రాళ్ళ నెక్‌లెస్ సూర్యుని ఆఖరికాంతికి గుండ్రటి కంఠంచుట్టూ ఇంద్ర ధనుస్సు నీడల్ని వరు స్తోంది ఆమె ముసిముసి నవ్వులకు ముక్కుపు టాలు ముచ్చటగా కదలాడుతున్నాయ్.

అతను మామూలు ఆఫీసరు దుస్తుల్లో ఉన్నాడు

వాళ్ళు ముందుకు సాగిపోయారు

సూర్యం గబుక్కున వెళ్ళిపోయే వాళ్లకేసి చూడ నారంభించాడు—కనురెప్పలు వాల్చ కుండా కంటికి కనిపించేవరకూ ఆత్రంగా చూశాడు.

ఆమె నడుస్తోంటే — సరస్సులో చంద్రుడ్ని చూసి హంసలు అందంగా నాట్యంచేసినట్టూ, నెమలి ఫించం విప్పకొని వొయ్యారంగా నడు స్తున్నట్టూ, సెలయేరు బద్ధకంగా ప్రవహిస్తు న్నట్టూ తోచింది; వాలుజెడ సాగనూ, నడు స్తోంటే పిరుదుల క్రిందివరకూ జారే ఆ జెడ రిబ్బనూ సూర్యం హృదయాన్ని కళుక్కుమని పించాయి.

ఎవరామె? ఎక్కడో, ఎప్పుడో, ఏ సందర్భం లోనో, ఎందుకో - చూసినట్టు గుర్తు!

ఎక్కడ? ఎప్పుడు? ఏ సందర్భంలో? ఎందుకు చూశాడు తను? అక్కడ.... అప్పుడు ... ఆ సందర్భంలో చూసినప్పుడు .. ఆమె వెనుక భాగం కూడా .... ఇంత గొప్ప ఆకర్షణగా, సౌందర్యంతో ఉంది. అప్పుడు తను ఆమెను ఆ క్షణాన యిట్లాగే మెచ్చుకున్నాడు. కాని ...కాని....ఎవరామె?.... ఎవరు? ..ఈమేనా .. ఆమె?

క్రింది పెదవిని పైపంటితో నొక్కిపట్టి-కొన్ని క్షణాలపాటు తీక్షణంగా ఆలోచించాడు.

—అయిదు సంవత్సరాల క్రితం....

అంతేనా?....అయిదు సంవత్సరాల క్రితం తను ఈమెను చూశాడు తలిదండ్రుల బల వంతంమీద, మామయ్య వత్తిడివల్ల-తను పెళ్లి చూపులకు పాలెం వెళ్ళాడు పెళ్ళి కూతురు ఈమే! ఈ అమ్మాయే తనఎదుట గదిలో పది నిముషాలపాటు చేతనైనంతవరకు చేయబడ్డ అలంకరణతో, వయస్సు నేర్పినంత సిగ్గుతో- కుర్చీలో కూర్చుంది. అప్పుడు తను ఆమెను చూడటానికి ఉత్సాహపడలేదు అందువల్లగా ఒక్కసారికంటె ఎక్కువ చూసియుండలేదు పైపెచ్చు తనకి 'జీవితంలో పెళ్ళిచేసికో రాదు' అన్న అభిప్రాయం ఉండటంచేత, ఆమెను యిల్లాలుగా చేసుకోవాలన్న కాంక్ష లేకపోవడం చేత-ఆమెను నాలుగు గోడల మధ్య బంధించి,

సిగ్గుతో ముడుచుకుపోయే మల్లెమొగ్గవలె కావడం సహించలేక తను ముఖంలో అనిష్ట తను కనుబర్చాడు క్రిందికి దించిన చూపుల్ని మరల్చలేదు, పెదవుల్ని విప్పలేదు ఆమె కొంతసేపు సిగ్గుతో బుగ్గల్ని ఎరుపుచేసికొని, చెంగున లేచి ఇంట్లోకి దూరింది గదిలోంచి ఆమె వెళుతూన్నప్పుడు తను చూశాడు జఘన సౌందర్యం - నడకలోని నాజూకుదనం - జెడ యొక్క సొగసు

—తర్వాత ఆమెకు పెళ్ళి అయిందన్నమాట! ఇద్దరు పిల్లలుకూడా.... మరి తనకి?

తనకి ఇంకా పెళ్ళే కాలేదు!

ఆ భావం మనస్సులో హఠాత్తుగా రావటంతో కొన్ని క్షణాలపాటు సూర్యం ఉక్కిరి బిక్కిరైనాడు ఒళ్ళంతా అదోరకంగా అయింది. నిలబడినవాడు నిలబడ్డట్టే ఉండిపోయాడు.

తను పెళ్ళి చేసికో కూడదనుకుంటూనే తలిదండ్రుల బలవంతంమీద నాలుగుసార్లు 'పెళ్ళి చూపుల'కు వెళ్ళివొచ్చాడు యీ ఆయిదేళ్లలో బహుశా వాళ్ళంతా పెళ్ళిళ్లు చేసికొని పిల్లల్ని కనివుంటారు. తను ఇట్లానే ఉన్నాడు? తనకి ఊహ వొచ్చాక పుట్టిన కోటయ్య కూతురు కోమలాంబ పెళ్ళిచేసికొని పిల్లవాడ్ని కన్నది; తనకంటె రెండేళ్లు చిన్నవాడైన కరణం కోదండరామయ్యగారి కొడుకు కోటేశ్వర్రావు ఇద్దరి పిల్లల తండ్రియైనాడు ఇట్లా ఎంత మంది....?

కాని, తను ఇంకా పెళ్ళి ఎందుకు చేసికోలేదు?

తను బి ఏ కానీ, ఎం ఏ కానీ చదువుతున్నాడా?

తనకి పెళ్ళి వయసు రాలేదా?

తనకి పిల్లను ఇచ్చేవాళ్లు ఆంధ్రదేశంలో కరువైనారా? ఉహూఁ! ఇదేమీ కారణాలుకాదు.

తను ఉద్యోగం చేస్తున్నాడు మరొక బ్రతుకును భరించగల శక్తి సామర్థ్యాలు తనకి ఉన్నవి తల్లిదండ్రులు — పెళ్ళిచేసుకోమని, కోడల్ని, మనవసంతానాన్ని చూడాలని తహతహగా ఉందనీ ఎన్ని సంవత్సరాల్నుంచి వేడుకొంటున్నారు! బంధువులు ఎన్నిసార్లు సలహాలిచ్చారు 'పెళ్ళి చేసికోమని'?

తనకి పెళ్ళంటే అంత అనిష్టత ఎందుకు?

స్త్రీ అంటే - భయమా?....ఎందుకు?

సంసారమంటే - జుగుప్సా? .... ఎందుకు? ఎన్ని సంసారాలు లోకంలో సుఖంగా జీవనం గడపడంలేదు?

తను సన్యాసం పుచ్చుకోబోతున్నాడా! లేదు

స్త్రీ సౌఖ్యాన్ని తను వాంచించడం లేదా? అదెట్లా?

మరి తనెందుకు పెళ్ళిచేసికోడు?

సాయంకాలపు ఎండ సమసిపోయింది. సూర్యం మనస్సు కొత్త ఊహల్లో ఇరుక్కుపోయింది హృదయం ఏదో నిర్వచింపరాని బాధతో ఉనూరుమంటోంది. నిలబడ్డ సూర్యం నిలుచునే ఉన్నాడు చూచాయగా కనుచీకటి పడింది కొంత సేపటికి కనుచీకటి అసలు చీకటైంది సూర్యం మనస్సుకు సంకెళ్లు తగిలించిన ఊహలు - సంకెళ్లను సడలించాయి.

చీకట్లో సూర్యం చిరునవ్వు నవ్వుకున్నాడు

నరాలు, కొత్త శక్తిని పొందినట్టు హుషారును ప్రకటించాయి కళ్ళముందు - పిల్లను ఎత్తుకొన్న ఆమె....పిల్లవాడిని నడిపిస్తున్న ఆమె భర్తా మెదిలారు. 'అదే జీవితం' అనుకున్నాడు సూర్యం

'అక్కడే ఉంది స్వర్గం'అన్నది సముద్రపు ఘోష.

'ఏమంటావు?' అని ప్రశ్నించాయి ఆకాశం పైని నక్షత్రాలు

సూర్యం తన గదికి వొచ్చాడు వెంటనే తండ్రికి ఉత్తరం వ్రాశాడు.

''నాన్నా!

—నేను పెళ్ళి చేసికోవాలనుకున్నాను మంచి పిల్లను వెదుకు సాధ్యమైనంత త్వరలో పెళ్ళి జరిగిపోవాలి.'' ★

